
# అంతరంగం

శ్రీనివాస్ గౌడ్



"హా టె ఛార్మింగ్ ఫేస్ ! అంతటి బ్యూటిఫుల్ గాళ్‌ని చూట్టం నా ట్వెంటీ ఫైవ్ ఇయర్స్ లైఫ్‌లో ఇదే ఫస్ట్ టైంరా !" సిగరెట్ పొగని గుండెనిండా పీల్చి తన్మయత్వంతో అన్నాడు కృపాకర్.

"నా మనసు పెళ్ళి పైకి మళ్ళడానికి కారణం కూడా నిస్సందేహంగా ఆ అమ్మాయే !" తిరిగి తనే అన్నాడు.

గ్లాసుల్లో రమ్ వొంపి, ఫోర్‌సెప్‌తో ఐస్ క్యూబ్స్ వేయబోతున్న విష్ణు చేస్తున్న పనాపి కృపాకర్ కేసి విస్మయంగా చూశాడు.

ఆడపిల్లలకి ఆమడ దూరంలో ఉంటూ, కనీసం వాళ్ళని కన్నెత్తైనా చూడని అపర ప్రవరాఖ్యుడి లాంటి కృపాకర్ నోటి వెంట ఒక అమ్మాయి గురించి ప్రశంసాపూర్వకమైన మాటలు వినడం ఒక్క విష్ణు కేమిటి, ఎవరికైనా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

ఒక బార్ అండ్ రెస్టారెంట్‌లో ఒక కార్నర్ సీట్లో కూర్చొని ఉన్నారు కృపాకర్, విష్ణు.

అసలు విషయం త్వరగా చెప్పమన్నట్టుగా కృపాకర్ కేసి కుతూహలంగా చూశాడు విష్ణు.

గ్లా సెత్తి గటగటా తాగేసి, ప్లేట్లోని రోస్ట్ చేసిన మటన్ కబాబ్‌ని ఫోర్క్‌తో నోట్లో పెట్టుకొని నెమ్మదిగా చెప్పడం మొదలెట్టాడు కృపాకర్.

** ** **

"ఒరేయ్ కృపా ! ఆఫీ సైపోగానే నన్ను స్టేషన్లో డ్రాప్ చేయడం మరిచిపోకేం?" మరోసారి గుర్తు చేశాడు కొలీగ్ శ్రీధర్.

"సరేలేరా ! నాకేం చెముడు లేదు. మతిమరుపు అంతకన్నా లేదు! ఒక్కసారి చెప్పావుగా. గుర్తుందిలే !" ఫైల్లోంచి తలెత్తకుండానే, విసుగ్గా అన్నాడు కృపాకర్.

గడియారం అయిదు గంటలు కొట్టింది.

ఓసారి బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని సీట్లోంచి లేచాడు కృపాకర్. అప్పటికే శ్రీధర్ ఫైల్స్ సర్దేసి, కృపాకర్ కోసం చూస్తున్నాడు.

అయిదుంపావు.

కృపాకర్ స్కూటర్ సికింద్రాబాద్ స్టేషన్ వైపు దూసుకుపోతోంది. ట్రాఫిక్ మధ్యనుంచి చాకచక్యంగా స్కూటర్ తోలుతూనే శ్రీధర్‌తో కబుర్లు చెబుతున్నాడు. వాళ్ళ టాపిక్ సినిమాలనుంచి పాలిటిక్స్ వైపు తిరగకముందే స్కూటర్ స్టేషన్‌లోకి ప్రవేశించింది.

స్కూటర్‌ని పార్కింగ్ ప్లేస్‌లో ఆపి, బుకింగ్ కౌంటర్ వైపు నడిచారు.

టికెట్ తీసుకొని వచ్చాడు శ్రీధర్.

"జి.టి. ఎక్స్‌ప్రెస్ ఈ రోజు అరగంట లేట్. పద అలా కాంటీన్ కెళ్ళి కాఫీ తీసుకువద్దాం" అంటూ కాంటీన్ వేపు దారితీశాడు.

కబుర్లలో పడి కాఫీ సిప్ చేస్తూ, ఎందుకో తల తిప్పి పక్కకి చూసిన కృపాకర్ దృష్టిని ఆకర్షించింది, వారికి కాస్త దూరంలో నిలబడి ఉన్న ఒక అమ్మాయి.

క్షణకాలం ఆ అమ్మాయి కేసి చూసి, వెంటనే తల తిప్పేసుకున్నాడు. కాఫీ తాగి, ఒక సిగరెట్ శ్రీధర్‌కి ఆఫర్ చేసి, త నొకటి వెలిగించుకోబోతూ మరోసారి అప్రయత్నంగా ఆ అమ్మాయి వైపు చూశాడు.

ఆ అమ్మాయి కూడా అతనివైపే చూస్తోంది రెప్ప లార్పకుండా. అతను తనకేసి చూడగానే చిరునవ్వు నవ్వింది.

మధురమైన భావనావీచి కేదో మనసు పొరని సున్నితంగా స్పృశించిన అనుభూతి క్షణకాలం అతన్ని వివశుణ్ణి చేసింది.

ఎన్నడూ కలగని 'ఒక రకమైన' స్పందనకి గురైంది అతని అంతరంగం.

ఒక్క క్షణం తొట్రుపడినా, వెంటనే సర్దుకొని ఆ అమ్మాయి కేసి పరీక్షగా చూశాడు.

పచ్చని పసిమివన్నెతో, విశాలమైన మీన లోచనాలతో చాలా ఆకర్షణీయంగా ఉంది. రెండు కనుబొమ్మల నడుమ దోసగింజ ఆకృతిలో, అదే పరిమాణంలో ఉన్న బొట్టు • చంద్రబింబంలా గుండ్రంగా ఉన్న ఆ అమ్మాయి వదనానికి ఒక ప్రత్యేకతను ఆపాదిస్తోంది. సంపెంగలా ఉన్న నాసిక, సున్నాలా చిన్నగా ఉన్న నోరు, లేత గులాబీరంగులో ఉన్న పెదిమలు, నిండైన చెక్కిళ్ళు. రెండు జడల్లో ఒక జడ ముందుకు వేసుకొని ఉంది. తల్లో ఓ పక్కన గులాబీపువ్వు అందంగా నవ్వుతోంది. పింక్ కలర్ పంజాబీ సూట్‌లో గులాబీ బాలలా ఉంది ఆ అమ్మాయి.

గబాల్న దగ్గరికి వెళ్ళి ఆ బుగ్గలపైన గట్టిగా ముద్దు పెట్టుకోవాలనే కోరికని బలవంతాన అణుచుకున్నాడు కృపాకర్.

శ్రీధర్ ఏదేదో చెబుతున్నాడు. అన్నిటికీ 'ఊఁ' కొడుతున్నా ఒక్కటీ బుర్రలోకి ఎక్కడం లేదు.

"ప్రత్యూషా ! ఎంతసేపని అలా నిలబడతావ్? కూర్చోమ్మా !"

అప్పుడు చూశాడు - బహుశా ఆ అమ్మాయి తల్లిదండ్రులు కాబోలు. చాలా గారాబంగా పిలుస్తున్నారు. బుద్ధిమంతురాలిలా వెళ్ళి కూర్చుంది ఓరగా తనవేపు చూస్తూనే.

'ప్రత్యూష !' మనసులోనే అనుకున్నాడు కృపాకర్. 'స్వీట్ నేమ్ !' రూపానికి తగిన పేరు.

ఆ అమ్మాయినే తదేకంగా చూస్తుంటే అతని ఆలోచనలు అనుకోకుండా తన పెళ్ళిపైకి మళ్ళాయి.

ఇంతకాలం పెళ్ళి చేసుకోకుండా బ్రహ్మచారిలా ఉండిపోయినందుకు తనమీద తనకే కోపం వచ్చింది. అతని మనసు స్వాప్నిక జగత్తులో

విహరించసాగింది. పెళ్ళి చేసుకుంటే ఇలాంటి అమ్మాయి...

అతని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ పట్టాలను దడదడ లాడిస్తూ జి.టి. ఎక్స్‌ప్రెస్ వచ్చి ప్లాట్‌ఫామ్‌పై ఆగింది.

నిశ్చలమైన నీళ్ళలో రాయి విసిరినట్టుగా అక్కడ కలకలం మొదలైంది. జనం నానా హడావుడిగా అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు.

శ్రీధర్ కృపాకర్‌ని ఓ కంపార్ట్‌మెంట్ వైపు లాక్కెళ్ళాడు. శ్రీధర్ మీద పట్టరానంత కోపం వచ్చింది, తనని డిస్టర్బ్ చేసినందుకు.

శ్రీధర్‌ని అతని మానాన వదిలేసి, ఇందాక ఆ అమ్మాయి వాళ్ళు కూర్చున్న వైపు చూశాడు కృపాకర్.

ఆ చోటు ఖాళీగా వెక్కిరిస్తూ కనిపించింది.

అతని కళ్ళు ఆత్రతగా అంతటా వెతికాయి. ప్చ్ ! ఎక్కడా కనబడలేదు.

మనసంతా ఏదో వెలితిగా, అశాంతిగా అనిపించింది. మరొక్కసారి ఆ ముఖారవిందాన్ని పెదవులపైన కదలాడే అమాయకమైన చిరునవ్వును చూడాలని ఎంతో తపించాడు. ట్రైయిన్ కదిలే సమయానికి కూడా అతని కోరిక ఫలించనేలేదు.

శ్రీధర్‌కి చెయ్యూపి, నిరాశగా వెనుదిరగబోతున్న కృపాకర్ కళ్ళు వింతగా మెరిశాయి - శ్రీధర్ పక్క కంపార్ట్‌మెంట్‌లో విండో పక్క సీట్లో కూర్చొని తనని చూసి కళ్ళు చికిలించి, చిలిపిగా నవ్వుతున్న ప్రత్యూషను చూడగానే.

అప్రయత్నంగానే, సంతోషంగా చెయ్యూపాడు.

ఆ అమ్మాయి కూడా నవ్వుతూ చెయ్యూపింది. ఆ అమ్మాయి కనబడుతున్నంతవరకూ చెయ్యూపుతూనే ఉన్నాడు - ఆనందంతో చెమర్చిన కళ్ళతో.

** ** **

చెప్పడం ఆపి, గ్లాసులో మిగిలిన మందుని గొంతులోకి ఒంపేసుకున్నాడు కృపాకర్.

ఒక అద్భుతమైన పిక్చర్ చూస్తున్నట్టుగా, పూర్తిగా టేబుల్‌పైకి ఒరిగిపోయి కృపాకర్ కేసే నోరు తెరుచుకొని, కళ్ళు పెద్దవి చేసుకొని చూస్తున్నాడు విష్ణు. ఎంత దాచుకుందామన్నా దాగని ఆశ్చర్యం అతని ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

"వెరీ సర్‌ప్రైజింగ్ ! నిన్నే అంతగా ఆకర్షించిందంటే ఆ అమ్మాయిది అద్భుతమైన అందమై ఉండాలి. మొత్తానికి చాలా లక్కీ ఫెలోవిరా !" అన్నాడు కాసేపటికి తేరుకొని.

విష్ణు మాటల్లో అసూయ స్పష్టంగా ధ్వనించింది. తను ఫెయిల్ అయ్యానన్న బాధకంటే, పక్కవాడు పాసయ్యాడే అని కాన్వెంట్ స్టూడెంట్ బాధపడ్డట్టు - తనకి అలాంటి 'ఛాన్స్' దొరకలేదే అనే బాధ కంటే, ఆ అదృష్టం కృపాకర్‌ని వరించిందే అన్న బాధే ఎక్కువగా ఉంది విష్ణుకి.

అప్పటికే హాఫ్ బాటిలిని 'హాంఫట్' అనిపించారు ఇద్దరూ కలిసి.

"అంతా బాగానే ఉంది కానీ, ఒరే కృపా ! నువ్వొక పెద్ద పొరపాటు చేశా వనిపిస్తోందిరా నీ కృపకి పాత్రురాలైన ఆ ప్రత్యూష అడ్రస్ తీసుకొని ఉండాల్సింది." ఆమాత్రం ఆలోచన తట్టలేదా అన్నట్టుగా ఫేస్ పెట్టి అన్నాడు విష్ణు.

"బాగుందిరా నీ సందేహం ! ఆరేళ్ళ అమ్మాయికి అడ్రస్ రాయడం చేతనవుతుంటావా?" ఎదురు ప్రశ్నించాడు కృపాకర్.

"వ్వాట్?" అదిరిపడ్డాడు విష్ణు.

"ఆరేళ్ళ అమ్మాయేమిటి?" వీడిగ్గానీ నిషా నసాళానికి అంటిందా అన్నట్టు అనుమానంగా కృపాకర్ కేసి చూశాడు.

"టీ.వీ. రామాయణ్ అంతా చూసి, సీత పాత్ర వేసింది ఎవరు - అని అడిగాట్ట నీలాంటి వాడెవడో. అలా ఉంది నీ వాలకం. నేను చెప్తున్నది ప్రత్యూష గురించి !" తాపీగా అన్నాడు కృపాకర్.

"ఇంతదాకా నువ్వు చెప్పింది ఆరేళ్ళ అమ్మాయి గురించా?" ఆ వాస్తవాన్ని జీర్ణం చేసుకోలేకపోతున్నాడు. అతని మత్తు పూర్తిగా వదిలిపోయింది.

"మరి... మరి నీకు పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన కలిగింది 'ఆ అమ్మాయిని చూశాకే అని చెప్పావ్?" దాదాపు అరిచినట్టుగా అన్నాడు.

అంతవరకు రెండు జళ్ళతో ఉన్న పదహారేళ్ళ అమ్మాయి సుందర రూపాన్ని ఊహించుకొని, గాల్లో తేలిపోతున్న విష్ణు పరిస్థితి ఒక్కసారిగా రెక్కలు తెగి నేల కూలినట్టుగా ఉంది.

"ఓ, అదా?" క్షణం కళ్ళు మూసుకొని ఏవో అనుభూతులను నెమరు వేసుకుంటున్న వాడిలా మౌనం వహించి, కుర్చీలో వెనక్కి జారగిలబడి చెప్పసాగాడు సీరియస్‌గా. అతని స్వరం మంద్రస్థాయిలో వినిపిస్తోంది.

"విష్ణూ ! నీకు తెలుసా కదా ! ముక్కూ మొహం తెలియని ఇద్దరు స్త్రీ పురుషులను ఏకం చేసి, నూరేళ్ళ పాటు కలిసి బ్రతకమని శాసించే ఈ వివాహబంధం పట్ల నాకు సదభిప్రాయం లేదు.

"ఒకరి మనస్తత్వానికీ, మరొకరి వ్యక్తిత్వానికీ పొంతన కుదరక, భిన్నాభిప్రాయాలు, అభిరుచులు కలిగిన భార్యా భర్తల మధ్య సదవగాహన లోపించి, సహజీవనం కొరవడి వాళ్ళ కాపురాలు ప్రత్యక్ష నరకాలుగా మారడం నేను స్వయంగా చూశాను కూడా.

"మనం ఒకరితో ఎంతో సన్నిహితంగా మెలిగినా, ఒక్కోసారి వాళ్ళను గురించి తీసుకున్న అంచనాలు తారుమారు రవుతాయి. అలాంటిది, ముందు ఏమాత్రం పరిచయం లేని వ్యక్తిని అప్పటికప్పుడు మన జీవితంలోకి 'పార్ట్‌నర్'గా ఆహ్వానించడం - ప్చ్ ! ఎందుకో గానీ అలా చేయడానికి నా మన స్సంగీకరించలేదు. అందుకే - ఇంతకాలం బ్రహ్మచారిగానే ఉండిపోయాను.

"అయితే, విచిత్ర మేమిటంటే పెళ్ళికి వ్యతిరేకతను చూపే నా మనసు పసిపాపల్ని చూస్తే మాత్రం పులకిస్తుంది. నాకు పిల్లలంటే, అందునా ఆడపిల్లలంటే ప్రాణం. ఈ విషయం నేను ఎప్పుడూ బయటకు చెప్పకపోయినా మనసులో మాత్రం పిల్లంటే ప్రేమ రోజు రోజుకీ బలీయంగా పెరుగుతూంది. నా అభిరుచులకు తగిన స్త్రీ తటస్థించినప్పుడు మాత్రం తప్పకుండా పెళ్ళి చేసుకొని, ఒకరు లేక ఇద్దరు అమ్మాయిలు కలగగానే ఫుల్‌స్టాప్ పెట్టేయాలని ఏనాడో నిశ్చయించుకున్నాను. అమ్మాయి లంటే నా కంత ప్రాణం.

అలాంటిది ఈ రోజు ముద్దులొలికే ప్రత్యూషని చూడగానే నాలో అంతర్లీనంగా దాగి ఉన్న పుత్రికా వాత్సల్యం హృదయపు కవాటాలను ఛేదించుకొని అంతరాంతరాల్లో అణువణువునా నిండిపోయింది.

"ఇంతకాలం అలాంటి మమకారానికి దూరమై, నా ఆనందాన్ని నేనే చేజేతులా దూరం చేసుకున్నాననే వాస్తవాన్ని చాలా ఆలస్యంగా, ఈ రోజే తెలుసుకున్నాను. మూర్ఖంగా పట్టుపట్టి కూర్చోకుండా ఈపాటికే పెళ్ళి చేసుకొని ఉంటే, ప్రత్యూష లాంటి అందాల పాప చేత 'నాన్నా !' అని పిలిపించుకుంటూ ఉండేవాడిని."

అనర్గళంగా చెప్పుకుపోతున్న కృపాకర్ కేసి, నిషా పూర్తిగా వదిలిపోగా నిర్ఘాంతపోయి చూస్తూండిపోయాడు విష్ణు ! ★

